తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# మగబుద్ధి

మానేపల్లి

శేషగిరి యేడాది క్రితం బదిలీఅయి బెజవాడ నుంచి యిక్కడికి వచ్చాడు. ఈ మధ్య అతనికీ నాకూ బాగా పరిచయం కూడా పెరిగింది. అది స్నేహంగా కూడా వృద్ధి అవు తోంది.

ఆ రోజు ఆదివారం-

ఇద్దరం సినిమా హాలుదగ్గర కలిశాం. వాళ్ళింటికి చుట్టాలు వచ్చిపడ్డారట. ఆ దాడినుంచి విశ్రాంతి కోసం సినీమాకి వచ్చాడు. నాలుగు నెలల తరువాత ఇన్నాళ్ళకు మళ్ళీ సినీమాకి వెళ్ళాను. ఇద్దరం పక్కపక్కనే కూచున్నాం.


అతను ఆఫీసు పనిమీద ఇటీవల పదిరోజుల పాటు హైదరాబాద్‌లో గడిపి వచ్చాడు. ఆ విశేషాలు ఒకటొకటే చెప్పకొస్తున్నాడు. నా మట్టుకునాకు సినీమాకంటె ఆ కబుర్లే బావున్నాయి.

ఇంటర్వెల్ తరువాత సినీమాకథలో ఒక కొత్తఅమ్మాయి ప్రవేశించింది. అందంగా సన్నంగా, చాలా తాజాగా వుంది. ఆ అమ్మాయిని చూసి, శేషగిరి కొత్త విశేషాలు చెప్పడం మొదలుపెట్టాడు.

''సరిగ్గా యిలాగే వుంటుందా అమ్మాయి కూడాను. వయసు మహావుంటే ఇరవయిరెండు ఇరవయిమూడేళ్ళుంటాయి. టైపిస్టుగా కొత్తగా ఉద్యోగంలో చేరిందట. ఎంత ఫైన్‌గా వుం టుందో చెప్పలేం . సినీమా తారలందరూ ఆ పిల్లముందు బలాదూరే. కంఠం బహు శ్రావ్యంగా వుంటుంది. చాలాచలాకీగా వుంటుంది. మరి ఆమె ఎందుకలా మామూలు టైపిస్టుగా వుండిపోయిందో! కిలకిలలాడుతూ నవ్విందంటే - ఓహ్ - ప్రాణం గిలగిలలాడిపోవల్సిందే.

ఎవరు ఏ విషయం గురించి మాట్లాడుకోవడం ప్రారంభించినాసరే రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం, సాహిత్యం, సినీమాలు, కళలు.... చాలా త్వరలో ఆడవాళ్ళకబుర్లలోకీ, సెక్సుకబుర్లలోకీ దిగిపోతారు. ఈ సంగతి నేను చాలాకాలంనుంచి గమనిస్తున్నాను. ఆఫీసు భోగట్టాలు, ప్రమోషన్లు, బదిలీలు ఇలా మాట్లాడుతూ మాట్లాడుతూ నోరూరేలా చెప్పడం ప్రారంభిస్తారు. ఎక్కువభాగం, ఊహలు కల్పితాలూను - శేషగిరి యిందుకు భిన్నంకాదు. ఆఫీసు కబుర్లు చెప్పిచెప్పి ఆడపిల్ల గురించి ఆకర్షణీయమైన కబుర్లు ప్రారంభించాడు.

''పాపం పేదపిల్ల. ఒకరోజున నన్ను వాళ్ల యింటికి కూడా తీసుకు వెళ్ళింది. ఒక పాత కాలపు డాబాయింటిలో వుంటున్నారు. తండ్రి వెంకట శాస్త్రి చిన్నతనంలో నవాబు దగ్గర కొలువు చేశాడు. ఆ వుద్యోగం ఊడిపోయాక



ఏదో ప్రయివేటు కంపెనీలో పనిచేశాడుట. ఒకపక్క కూలిపోతున్న పాతకాలపు డాబాయిల్లు తప్ప ఏమీ లేదు. పెన్షన్ లేదు - అతనికి నలుగురు మొగపిల్లలూ, ఇద్దరు ఆడపిల్లలూను. మొగపిల్లలిద్దరు తగువు తెచ్చుకుని వేరు కాపురం వెళ్లిపోయారు. ఆడపిల్లల్లో ఈ అమ్మాయి చిన్నది - తండ్రి వయసు డెబ్బయి పైనే - నాకు జాలి వేసింది వాళ్ళస్థితి చూసి" - అని ఆగాడు శేషగిరి. కొంచెం ఊపిరి తీసుకుని మళ్ళీ ఉత్సాహంగా ప్రారంభించాడు.

"నాకు పెళ్ళయి వుండకపోతే - సమస్త ప్రపంచాన్ని ఎదిరించి అయినాసరే, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకుని వుందును. నలభైరెండేళ్ళ ఈ వయసులో యవ్వనం క్రమ క్రమంగా నిష్క్రమిస్తున్న సమయంలో ఆమెతో నేను పొందిన సౌఖ్యాలు...నా వల్ల కాదు- నేను వర్ణించలేను - నేను మళ్ళీ టీనేజ్ కుర్రాణ్ణయి పోయానంటే నమ్ము..." తన అనుభవాల్ని ఇంకా బ్లూఫిల్మ్‌లో చూస్తున్నట్టున్నాడు శేషగిరి. .. ఆ విషయం అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తోంది. చీకట్లో కూడా ఆ ముఖకవళికలు తళతళలాడి పోతున్నాయి.

"నేను హైదరాబాద్‌లో వుండవలసిన రోజులకంటే ఎక్కువే వుండిపోయాను. ఇంతలో ఆ అమ్మాయికి సహజమైన అడ్డు రానే వచ్చింది- చివరి రోజున సుల్తాన్‌బజార్‌కు వెళ్లి రెండు చీరలు కొనిపెట్టి, ఆమె పర్సులో రెండు వంద నోట్లు కూడా పెట్టాను. వద్దన్నది. నా బలవంతానే పుచ్చుకున్నది -"

"మళ్లీ హైదరాబాద్ వెళితే కలవవచ్చునన్న మాట-" అన్నాను చిరునవ్వు నవ్వుతూ.

"ష్యూర్ ష్యూర్ - " అంటూ నవ్వేడు. కాని వెంటనే అతని ముఖంలో రంగులు మారి పోయాయి. ఈసారి అతని కంఠంలో కూడా మార్పు కనిపించింది.

"మరొక గంటలో గోదావరి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతాననగా ఆఫీసు ప్యూన్ నాతో ఒక దారుణమయిన విషయం చెప్పాడు. ఆ అమ్మాయి మరికొందరితో కూడా లోగడ యిలాగే చేసిందిట. మొదట చాలా అమాయకంగా నటిస్తుందట. తరువాత క్రమంగా కథలోకి దించుతుందట. నాకు ఎంతమాత్రం నమ్మబుద్ధి కాలేదు - ఆమె అనాఘ్రాత పుష్పం అనీ - ఆ సుగంధాన్నీ, మకరందాన్నీ చవి చూచిన

# మకర సంక్రాంతి

సుప్తహృదికి చైతన్యపు చురకత్తులు
సప్తాశ్వుని గమనానికి సరిహద్దులు
సకల వ్యధా వనవాటికి జ్వలనార్చులు
మకర సంక్రాంతి దివ్య మంగళాహేలు

ధాన్యలక్ష్మి కర్షక గృహ ద్వారస్థిత
పౌష్యలక్ష్మి పల్లెపల్లె బహుజనహిత
భూలక్ష్మికి ఒళ్ళంతా పులకరింత
మకర సంక్రాంతి దివ్య మహిమయిదంత

ముగ్గులతో గొబ్బిళ్ళతో ముంగిళ్ళు
పసుపులతో తోరణాల వాకిళ్ళు
వరసలైన హృదయాల్లో పరవళ్ళు
మకర సంక్రాంతి కోరు మామూళ్ళు

శరజ్జ్యోత్స్నలై మనసుల విరబూస్తాయ్
మలయ పవన డింభకులై మది దోస్తాయ్
ఉత్సాహపు లాహిరిలో ఊగిస్తాయ్
సంకురాత్రి సంబరాలు సాటిలేనివోయ్

— సూర్యదేవర రవికుమార్

మొదటివాడిని నేనేనని ఎందుకో ఒకమూల నాకు నమ్మకం వుంది - "

సినిమా కళ్లముందు కదుల్తోందిగానీ - మా యిద్దరి మనసులోనూ మెదుల్తున్న ఆలోచనలు వేరు-

"నా సూట్‌కేస్‌లో బహుశా ఆ అమ్మాయి ఫొటో మా ఆవిడ చూసి వుండవచ్చు. నేను వెంటనే గ్రహించి ఆ ఫొటో తీసుకొచ్చి ఆఫీసులో నా బీరువాలో చాలా రహస్యంగా దాచేశాను. రెండు మూడు రోజులు మా ఆవిడ చాలా ముభావంగా వుంది. బాధపడుతోందనీ, పైకి చెప్పలేక పోతోందనీ అర్థమైంది. నన్ను మాత్రం మాటవరసకైనా అడగలేదు. గత పదిహేనేళ్ళుగా ఆమెతో కాపురం చేస్తున్నాను. ఏ విషయంలో చూచినా ఆమె వంటి నిజాయితీ గల భార్య వుండబోదు - ఇన్నాళ్ళకు నేనే ఆమెను మోసం చేశాను - భార్యలలో శీలాన్నీ, నిజాయితీని కోరే మగవాళ్లు, ఆ సూత్రం తమకు కూడా వర్తిస్తుందనుకోకపోవడం, మగవాడు ఎంతమంది పరాయి ఆడవాళ్లతో మసిలినా ఫర వాలేదనుకోవడం ఎంత ఘోరం - "

ఉన్నట్టుండి శేషగిరి ఈ విధంగా మాట్లాడటం నాకు అమిత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇప్పుడేకదూ అనాఘ్రాత పుష్పం గురించి మాట్లాడాడు - !

ఇంతలో తెరపై "శుభం" అనే అక్షరాలు కనిపించాయి. సినిమా లోంచి బయటకు వచ్చాడు శేషగిరి. దారిలో శీలం, పవిత్రత, భార్యాభర్తల్లో ఒకరిపట్ల మరొకరి నిజాయితీ ఇత్యాది అంశాల గురించి మాట్లాడాడు శేషగిరి.

** ** **

నిన్న - అవును నిన్ననే - సాయంత్రం ఆరుగంటల వేళలో టర్నర్ చౌల్ట్రీ దగ్గర సూపర్‌బజార్‌లో శేషగిరీ, అతనిభార్యా షాపింగ్ చేస్తూ కనిపించారు. శేషగిరి భార్యను నేను అదేచూడటం!

ఆమె ఎవరో కాదు - అవును - ఆమె!

ఈ విశాఖపట్నంలోనే సుమారు 15 సంవత్సరాల క్రితం విశాఖపట్నపు బీచ్‌లో ఎంతో అన్యోన్యంగా సాయంత్రాలు గడిపాం! ఎంత వెన్నెల కరగదీశాం! పెళ్లి చేసుకుతీరాలని ఎన్ని కలలుగన్నాం! ఎంత ఆందోళన పడ్డాం! నాకు వుద్యోగం లేదు - అంటే తలిదండ్రుల్ని ఎదిరించి ఇవతలికి రావడానికి తగిన ఆర్థికస్థోమత, సాంఘికభద్రత లేవు. స్నేహితులు మాయిద్దర్నీ ఎంతకాలం పోషిస్తారు. ఇంతలో ఆమె నెల తప్పడం... ఆ సమయంలో డాక్టర్‌శేఖర్ మమ్మల్ని కొంతవరకు ఆదుకున్నాడు. త్వరలోనే ఈ గొడవలు బయటికి రాకుండా ఆమెకు పెళ్లి జరిగిపోయింది...

ఈ కథంతా కొద్ది సెకండ్లలో కళ్లల్లో మెదిలింది.

దూరంనుంచి - జనంలోంచి - ఆమె నన్ను చూసింది. చాలా స్పష్టంగా చూసింది. కానీ గుర్తించిన లక్షణాలు ముఖంలో కనపడకుండా చాలా జాగ్రత్తపడింది. ఒకరి కొకరం ఎదురయ్యే పరిస్థితి తెచ్చుకోకుండా -నేను అక్కడే పుస్తకాల షాపులోకి దూరి అద్దాల్లోంచి వార్ని చూశాను.

స్త్రీలో మాత్రమే పవిత్రతను ఆశించే మగబుద్ధి ఎంత స్వార్థపర మైనది! ఇందుకు నేను కూడా మినహాయింపుకాదు - !